# పుస్తక పరిచయం




**సినీ, సాహిత్యరంగాల్లో** సవ్యసాచిలా తన ఆసక్తినీ, అభిరుచినీ ప్రయోజనాత్మకంగా చాటిచెబుతున్న వారాల ఆనంద్‌గారి తాజా కవితా సంపుటి ఈ 'అక్షర చెలిమె'. గత కవితా సంపుటుల మాదిరిగానే ఈ సంపుటిలోకూడా ఆనంద్‌గారి ఆలోచనలను అందంగా అలంకరించిన కవితలు 70 పైగా ఉన్నాయి. ఆనంద్ గారి కవితా శైలిగురించి తెలుగు కవితా ప్రియులకు వేరుగా చెప్పల్సిన అవసరం లేదు. కవితాకౌముది ద్వారానూ, లోగడ పుస్తక పరిచయాల ద్వారానూ వారాల ఆనంద్‌గారు కౌముది పాఠకులకు చిరపరిచితులే. కవితా రచనలో తనదైన శైలిని ఏర్పరచుకున్న ఆనంద్‌గారి ఈ సంపుటిలోని ప్రతి కవితలోనూ ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. మొట్టమొదటి కవితనుంచే ఈ ప్రత్యేక ఆకర్షణ మొదలౌతుంది. అంతర్గత ఘర్షణద్వారానే కవితా ఝురి మొదలౌతుందని చాలామంది కవులు చాలాసార్లు చెప్పిన అంశమే ఐనా ఆనంద్‌గారు ఎలా చెబుతున్నారో చూడండి " అప్పటి దాకా నాలో / మూసి ఉన్న దర్వాజా / ఏదో తెరుచుకున్నట్టయింది.. / పిడికిట్లోంచి సన్నని ఇసుకేదో రాలిపోయినట్టు / ఏదో జారిపోతున్నది / చూద్దును కదా కాగితంపై / కవిత్వం విచ్చుకుంటోంది ". మనసులోంచి జాలువారే భావాలకు అక్షరరూపం కల్పించడాన్ని పిడికిట్లోంచి జారే ఇసుకతో పోల్చడం సరికొత్త అభివ్యక్తీకరణ. ఇలాంటివి ప్రతి కవితలోనూ ఎక్కడో చోట మెరుస్తూ, ప్రతి కవితనూ హృదయానికి హత్తుకునేలా చేస్తాయి. "పోగుట్టుకున్నది / వెదుక్కోడానికి కాదు / కవిత్వం - / పోగొట్టుకున్నది కూడా / మన వెంట వుండడమే / కవిత్వం" కవిత్వానికి ఎంత అందమైన నిర్వచనం..!! "తెరిచిన కన్నుల నుండి / మూసే రెప్పలదాకా / నిరంతర ప్రయాణం / కాలంతో పాటు / నా కలల్తో పాటూ..!" అందరికీ తెలిసిన సత్యమే ఐనా దాన్ని వ్యక్తీకరించిన విధానమే ఆనంద్‌గారి కవిత్వపు సొంత సంతకం! "జెండాలానో, గాలిపటంలానో / ఎంతగా ఎగిరినా / విజయాన్ని మించి ఎగరలేవు / ప్రేమను మించి పొందలేవు" చివరి రెండు పంక్తులనూ అర్థం చేసుకోగలిగితే జీవితపు పరుగుపందేనికి సరైన అన్వయం దొరుకుతుంది. ఓ కవితలో ఆయన చెప్పినట్లే 'ఒకటా రెండా / తల నిండా జ్ఞాపకాల ఉప్పెన' - ఈ పుస్తకంలో మంచి కవితలగురించి చెప్పాలంటే 'ఒకటా రెండా / ప్రతిపుటలోనూ కొత్తభావాల ఉప్పెన'. అదీ వారాల ఆనంద్‌గారి కవిత్వం..! ★★★

For Copies:
V. INDIRA RANI
H.No. 8-4-641, Hanuman Nagar
Karimnagar - 505 001.
TELANGANA.
Cell : 9440501281.
and
All leading Book Sellers




డా.బొద్దుల లక్ష్మయ్య
ఇం.నె 3-7-575 , వావిలాలపల్లి
కరీం నగర్ - 505 001
ఫోన్: 9985004912

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor,
KOUMUDI (Web Monthly)
4251 - Escudo Ct
Dublin - CA 94568, USA

**ఇదొక** విలక్షణమైన పద్య కవితా సంకలనం. డా.బొద్దుల లక్ష్మయ్యగారు నాలుగు దశాబ్దాలు తెలుగు బోధనలో గడిపారన్న విషయం ముందు మాటలద్వారా విశదమౌతుంది. అలానే లక్ష్మయ్యగారు 1976లో శంకరప్ప శతకంతో ప్రారంభించి అనేక పద్యకావ్యాలు రచించి ప్రబోధిస్తున్నారన్న సంగతి కూడా ముందుమాటల్లో ప్రస్తావించబడింది. వీరిగురించి వ్రాస్తూ డా.డింగరి నరహరి ఆచార్యగారు "పల్లె నుండి అమెరికా దాకా జీవితం అనుభవించినవాడు. అనేకానేక అనుభవాలు మంచీ చెడుల ఘర్షణలో స్వంత నిర్ణయాలు తీసుకుంటూ నిజాయితీ మార్గంలోనే ప్రయాణించే ఆశయం ఆయనను ఒక మనీషిగా తీర్చిదిద్దాయి" అని చెప్పారు. ఈ సంపుటి పద్యకవితా సంపుటి. డా.లక్ష్మయ్యగారు వివిధ సందర్భాల్లో, వివిధ వ్యక్తులగురించి, వివిధ అంశాల గురించి వ్రాసిన పద్యాలు ఈ పుస్తకం నిండా కొలువు దీరాయి. దేశనాయకుల నుంచి సొంత కుటుంబసభ్యుల దాకా, పదవీ విరమణ చేసిన సహోధ్యాయుల నుంచి ఫేస్ బుక్ మిత్రుల దాకా ఎంతో మంది గురించి ఆత్మీయంగా చెప్పిన భావాలెన్నో అందమైన పద్యాల రూపంలో ఈ పుస్తకంలో చోటుచేసుకున్నాయి. ఈ పద్యాల్లోని పదాలూ, భావాలు అత్యంత సరళంగా, అందరికీ తేలికగా అర్థమయ్యే రీతిలో ఉన్నాయి. డా.లక్ష్మయ్యగారి నిజాయితీ, స్నేహితులపట్ల గల అభిమానమూ, పెద్దలపట్ల గల గౌరవమూ ప్రతి పద్యంలోనూ ప్రతిబింబిస్తాయి. మొట్టమొదటి శీర్షిక 'ప్రేరణ'లో తనగురించి తెలియచేస్తూ " ధనము విద్యయు రెండు నా కనుల ముందు / కదల ధనమే ప్రధానంబుగా దలంచి / మొగ్గితిని దాని వైపుకే యొగ్గు కలిగె / నిలను సాహితీ రంగాన చులకనైతి ' అని నిజాయితీగా చెప్పారు. 'నీతిని వ్యంగ్యాత్మకమగు / రీతిని వ్రాయుటయె లోక ప్రీతిని గూర్చున్ / జాతిని దిద్దుటయే కవి / వ్రాతకు సాఫల్యమగుట వ్రాసెద నటులన్ ' అని తను వ్రాయదలచుకున్న విధానం గురించి స్పష్టంగా తెలియచేశారు. కవితా దినోత్సవ సందర్భంలో " లోకులంత చూచి మాకేమి పనియని / కదులు చున్న కవియు కదలిపోయి / కష్టజీవి గతికి కరిగి కన్నీరగు / వాని పలుకులందు వాణి నిలుచు" అని వ్రాశారు. మిత్రుల గురించి ఆత్మీయంగా చెప్పిన వాటికి ఒక ఉదాహరణ - సుద్దాల అశోక్ తేజగారి గురించి వ్రాసిన పద్యం "సుమతి సుద్దాల వంశాబ్ధి సుతుడ నీవు / తండ్రి హనుమంతు వాసత్వంబు వలన / కవిగ నలరె అశోకను స్తవము కలిగె / పేరు నందున్న తేజమే పెంచు మిమ్ము ". ఆసక్తికరంగా చదివించే పద్యాలివన్నీ. పద్యాల రచన అరుదౌతున్న ఈ కాలంలో అందరికీ సులువుగా అర్థమయ్యే రీతిలో ఈ పద్యాలను రచించి పుస్తకరూపంలో తీసుకొచ్చిన డా.లక్ష్మయ్యగారు అభినందనీయులు.

★★★